ప్రజాశక్తి
మంగళవారం 15 నవంబర్ 2022
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తూతూ మంత్రంగా సమగ్ర సర్వే

- పరికరాలు ఇవ్వకుండానే మండల రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు
- మ్యాన్యువల్‌గా భూములు కొలవాలని హుకుం
- ప్రభుత్వ తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - పరవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని నిన్నమొన్నటి వరకూ అధికారులు ఢంకాబజాయించారు. వందేళ్ల తర్వాత చేపడుతున్న ఈ రీ సర్వేతో ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వం ఊదరగొట్టింది. ఒక్కో మండలంలో సర్వే నిర్వహణకు నాలుగు నెలలు పట్టనుందని, సర్వే సమయంలో వచ్చే భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక మొబైల్ కోర్టులను ఏర్పాటు చేస్తామని సిఎం జగన్మోహన్ రెడ్డి కూడా చెప్పారు. అత్యాధునిక సర్వే యంత్రాలతో సర్వే చేసిన ప్రతి భూమికి యూనిట్ నెంబర్ ఇవ్వడంతో ఆ భూమికి సంబంధించిన అన్ని వివరాలు అధికారికంగా నమోదవుతాయని, భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఆయన ఉన్నతాధికారులుతో పలు భూ సర్వే సమీక్షల్లో చెప్పుకొచ్చారు. అయితే, వాస్తవం వేరుగా ఉంది. మండలాల్లో ఈ భూసర్వే తూతూ మంత్రంగా సాగుతోంది.



ఇ.బోనంగిలో మ్యాన్యువల్ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

ఒక మండలంలో సమగ్ర సర్వే జరగాలంటే డ్రోన్లు, ఒఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్ల సమకూర్చుకోవాలి. అప్పుడు సర్వే జరపాలి. కానీ అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో సర్వే పరికరాలు ఇవ్వకుండానే మండల స్థాయి రెవిన్యూ అధికారులపై జిల్లా స్థాయి అధికారులు ఒత్తిళు తెచ్చి తూతూ మంత్రంగా రీ సర్వే జరిపిస్తున్నారు. పరికరాలు లేని చోట మ్యాన్యువల్‌గా భూములు కొలవాలని జిల్లా అధికారులు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. పరవాడ మండలంలో మొత్తం 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ సమగ్ర సర్వే వల్ల మండలాధికారులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. మండల పరిధిలో ఉన్న రెండో ఫేజ్‌లో 9 రెవెన్యూ గ్రామాల్లో ఒకే సారి సమగ్ర రీ-సర్వే మొదలు పెట్టాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లుఉన్నాయని మండల మిగతా 2లో..



పెరీరాను సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, తదితరులు

చరిత్రకు నిలయాలు గ్రంథాలయాలు

- జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణానికి చర్యలు
- గ్రంథాలయ వారోత్సవ సభలో మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చరిత్రను తెలుసుకోవాలన్నా, వివిధ అంశాలపై విజ్ఞానాన్ని సంపాదించాలన్నా గ్రంథాలయాల్లోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహించనున్న 55వ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక వుడా చిల్డ్రన్ థియేటర్‌లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో' అంటూ కందుకూరి వీరేశలింగం పంతులు మాటలను ఉటంకిస్తూ.. పుస్తకానికి ఉన్న బలం చాలా గొప్పదని పేర్కొన్నారు. పుస్తకం చేతిలో ఉంటే ప్రపంచాన్ని ఏలవచ్చని అన్నారు. గ్రంథాలయాల కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. అప్పటి పెద్దల ఆలోచన విధానం వల్లే నేడు దేశంలో వేలాది గ్రంథాలయాలు వెలిశాయని అన్నారు. సాంకేతిక విజ్ఞానం పెరగడంతో నేడు అందరూ సెల్ ఫోన్ల ద్వారా మిగతా 2లో..

ఘనంగా బాలల దినోత్సవం

▶ వార్తలు లోపల పేజీల్లో..

ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి

▶ వార్త 2లో..

ప్రధాన న్యాయమూర్తిగా గోపి బాధ్యతల స్వీకరణ

▶ వార్త 4లో..



ఎన్ఎడిబి మెయిన్ గేటు వద్ద బైఠాయించిన నిర్వాసితులు

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

కొనసాగుతున్న ఎన్ఎడిబి నిర్వాసితుల ఆందోళన వార్త మెయిన్‌లో..

మోడీ, పవన్ ఏం మాట్లాడుకున్నారు..?

వారి భేటీ వెనుక 'గేమ్ ప్లాన్'పై సర్వత్రా చర్చ





ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 11వ తేదీ రాత్రి విశాఖలోని ఐఎన్ఎస్ చోళాలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మధ్య జరిగిన భేటీ తాజాగా విశాఖలోనూ, ఎపి అంతటా చర్చ జరుగుతోంది. రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్నవారు... లేనివారు అంతా ఈ అంశంపైనే దృష్టిసారించడం సహజమైన విషయమే. అయితే మోడీతో పవన్ ఏం చెప్పి ఉంటారు ?. మోడీ ఎలా స్పందించి ఉంటారు ? రాష్ట్రంలో పరిస్థితులు మోడీకి వివరించానని పవన్ బయటకొచ్చి మీడియా సమావేశంలో చెప్పిన సంగతి తెలిసిందే. అయితే, ఏం మాట్లాడారన్నది పవన్ బయట వెల్లడించకపోవడంతో అందరి దృష్టినీ ఈ భేటీ ఆకర్షించినట్టయింది. రాష్ట్రంలో పవన్ ఎక్కడికి వెళ్లినా వైసిపి శ్రేణులు ఏదో ఒక రకంగా ఆయన పర్యటనకు ఆటంకం కలిగించడం, విశాఖ పర్యటననూ అడ్డుకోవడం గురించి తెలిసిందే. తాజాగా జనసేన - వైసిపిల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ వాతావరణం కొనసాగుతున్న క్రమంలో ఈ భేటీ జరిగినందున మోడీకి రాష్ట్రంలో వైసిపి పాలన, జగన్ పాత్రపై పవన్ కల్యాణ్ గట్టిగానే చెప్పి ఉంటారన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

ఆ మరుసటి రోజునే అంటే 12న ఏయూ గ్రౌండ్స్‌లో ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలసి ఒక వేదిక నుంచి ప్రసంగించారు.

అదే రోజు సాయంత్రం పవన్‌కల్యాణ్ రుషికొండ ప్రాంతాన్ని తమ పార్టీ శ్రేణులతో సందర్శించారు. కానీ జగన్ వెళ్లాక పవన్ నోరు విప్పలేదు. ఈ నేపథ్యంలో మోడీతో జరిగిన సంభాషణలో ఆయనకు ఈయన చెప్పిన విషయాలపై ఎలా స్పందించారు ? అసలేం చెప్పారన్నది అందరిలోనూ చర్చ సాగుతోంది.

మూడు ప్రధాన పార్టీలకూ సంకేతాలెళ్లినట్టేనా?

2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి వ్యతిరేక ఓట్లు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తూతూ మంత్రంగా సమగ్ర సర్వే

రెవెన్యూ అధికారులు హడలిపోతున్నారు. ఏదో ఒక విధంగా రీ-సర్వే మొదలు పెడదాం అనుకుంటే మండలం మొత్తానికి ఒకే డ్రోన్, అరకొర పరికరాలు ఉన్నాయి. మండలంలో రెండో ఫేజ్‌లో నిర్ణయించిన తానాం, భర్నికం, పిఎస్.బోనంగి, పిఆర్.బోనంగి, ఇ.బోనంగి, కలపాక, పెదముషిడివాడ, కన్నూరు, పరవాడ, వెన్నెలపాలెం రెవిన్యూ గ్రామాల్లో ఈ అరకొర పరికరాలతోనే సర్వేకు సిద్ధమయ్యారు. అందులో మూడు రెవెన్యూ గ్రామాల్లో సర్వే యంత్రాలతోనూ, మిగతా ఆరు రెవెన్యూ గ్రామాల్లో మ్యాన్యువల్ పద్ధతిలోనూ భూములను కొలుస్తున్నారు. దీంతో మండల రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది తీవ్ర పని ఒత్తిడికి గురౌతున్నారు. మండలం మొత్తానికి ఒక డ్రోన్, అరకొర పరికరాలు అందించి ఒకేసారి అన్ని రెవెన్యూ గ్రామాల్లో రీ-సర్వే ఎలా చేయాలని కొంతమంది అధికారులు ప్రభుత్వంపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు రైతుల్లో అయోమయం నెలకొంది. రీ సర్వేలో లోపాలు ఉన్నాయని ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే సర్వే కోసం ఖర్చు పెట్టిన ప్రభుత్వ ధనం వృథాగా పోతుందనే వాదనలు కూడా పలువురి నుంచి వినిపిస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు ఇప్పటికైనా స్పందించి సమగ్ర సర్వేకు పూర్తి స్థాయిలో సర్వే పరికరాలను అందించి, ఆ తరువాతనే గ్రామాల్లో సర్వే మొదలు పెట్టాలని కోరుతున్నారు.

రోజుకు 20 ఎకరాల సర్వే

మండలంలో మూడు చోట్ల మెషిన్ ద్వారా సర్వేలు చేపడుతున్నాం. మిగిలిన ఆరు చోట్లా ముందుగా మ్యాన్యువల్ సర్వే చేస్తాం. తరువాత రోవర్ల ద్వారా సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్లు వేస్తాం. రోజుకు 20 ఎకరాలను సర్వే చేయాల్సి ఉంది.

వి.ప్రకాశరావు, తహశీల్దార్

మోడీ, పవన్ ఏం మాట్లాడుకున్నారు..?

చీలకుండా జాగ్రత్తపడేందుకు బిజెపి, తెలుగుదేశం, జనసేన పనిచేసేలాగ కృషిచేస్తానంటూ పదేపదే పవన్ కల్యాణ్ పలు వేదికల్లో చెప్పిన సంగతి తెలిసిందే. మోడీతో భేటీ తర్వాత మాత్రం ఈ మాట ఎక్కడా వినపడంలేదు. ఎందుకంటే పవన్ ఇంకా బిజెపి చట్రంలోనే బిగుసుకుని ఉన్నారు. అంతేగాక వైసిపిని ఒక లైన్‌లోనూ.. తెలుగుదేశం పార్టీని మరో లైన్‌లోనూ బిజెపి నిలబెట్టిందన్నది రాజకీయ విశ్లేషకుల నుంచీ వ్యక్తమవుతోంది. ఇదిలా వుండగా బిజెపి, వైసిపి రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కలిసే ప్రయాణం చేసే సంకేతాలుగా విశాఖలో మోడీ పర్యటన, సభా ఏర్పాట్లలో వైసిపి నాయకత్వం పూర్తిగా నిమగ్నం కావడం తెలిసిందే. అసలు బిజెపి గేమ్ ప్లాన్ వేరేగా ఉందని, ఆ విషయం పవన్‌తో చర్చల్లో బయటపడిందన్నది తెలుస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీని ఎంత దూరం వుంచితే తర్వాత అంటే 2029 నాటికి జనసేన బలపడే అవకాశాలు ఉంటాయన్న అవగాహన భేటీ అనంతరం వచ్చిందా ? అన్న అనుమానాలు వెల్లడవుతున్నాయి. అలాగే వైసిపి గంతులేస్తే పక్కనే బల్లెంలాగ పవన్ కూడా తమతో ఉన్నాడని చెప్పే యత్నాలకు విశాఖ వేదికగా బిజెపి ఒక సంకేతం పంపిందన్నది వైసిపి శ్రేణుల నుంచీ వ్యక్తమవుతోంది. మోడీ గేమ్‌ప్లాన్ ఇదే అయితే పవన్ వైసిపి పట్ల గతంలో మాదిరిగా విరుచుకుపడతారా ? అన్నది అనుమానమే. చంద్రబాబును, టిడిపిని రాష్ట్రంలో ఎన్నికల్లో పాలన అంచుల దగ్గరకు రాకుండా మోడీ స్కెచ్‌ను పవన్‌కు చూపించాడా ?.. మొత్తానికి ఏమైతేనేమీ పవన్‌ను ఆశల పల్లకిలో ఊరిస్తూ.. చంద్రబాబును దూరం పెడుతూ, వైసిపికి హెచ్చరిక సంకేతాలను మోడీ పంపారన్నది ఎక్కువ మందిలో చర్చగా ఉంది.

చరిత్రకు నిలయాలు గ్రంథాలయాలు

వివిధ సమాచారాన్ని తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నా, గ్రంథాలయాల్లో దానికన్నా విలువైన సమాచారం ఉందన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల వివిధ రకాల పుస్తకాలతో పాటు భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయని చెప్పారు. గ్రంథాలయాలు జ్ఞానానికే కాదు మానసిక ఉల్లాసానికి కూడా ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు రాష్ట్రంలో రూ.15 వేల కోట్లతో నాడు - నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ నడిబొడ్డున ఉన్న సుమారు ఎకరం స్థలంలో అత్యాధునిక గ్రంథాలయాన్ని నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని అన్నారు. చాలా కాలంగా ఆ స్థలం ఆర్మ్‌డ్ ఫోర్స్ ఆధీనంలో ఉండేదని, సిఎం ఆదేశాల మేరకు ఎంపీ విజయసాయిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి చొరవతో తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఈ గ్రంథాలయ నిర్మాణానికి అయ్యే ఖర్చును వివిధ పారిశ్రామిక సంస్థలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. జివిఎంసి నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.120 కోట్ల నిధులు రావాల్సి ఉందని, నెలకు రూ.50 లక్షలు చొప్పున చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మన దగ్గర ఉన్న పుస్తకాలే కాకుండా గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను కూడా పఠనం చేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి మాట్లాడుతూ సమాజ వికాసంలో గ్రంథాలయాల పాత్రను వివరించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, డిఇఒ చంద్రకళ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా పెన్ స్కూలు ఛైర్‌పర్సన్ పెరీరాను అతిథులు సత్కరించారు.

ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఘంటసాల గాయకుడు మాత్రమే కాదు.. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలు జీవితం గడిపిన గొప్ప దేశ భక్తుడని ఘంటసాల కోడలు, ఘంటసాల శత జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ కృష్ణకుమారి తెలిపారు. ఆ మధుర గాయకునికి భారతరత్న ప్రకటించాలని కోరారు. శతాబ్ది గాయకుడు ఘంటసాల శత జయంతోత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ హృదయాలను రంజింపజేసే విరహ గీతాలైనా, కళ్ళ ముందు దైవం సాక్షాత్కరించే విధంగా భక్తి గీతాలైనా, తెలుగువారి జానపద రూపాలు, పల్లెటూరి సొగసులు, ప్రకృతి అందాలు కళ్ళముందు కదలాడాలన్నా, హృదయాలను ద్రవింపజేసే విషాద గీతాలైనా స్ఫురణకు వచ్చేది ఘంటసాల రూపమేనని ఆమె అన్నారు. కేవలం పాటలే కాకుండా, సంగీత దర్శకునిగా, ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఒక ముఖ్యమైన వ్యక్తిగా, అన్నిటికీ మించి ప్రజలను చైతన్యం కలిగించే 18 పాటలను రాసిన ప్రజా కవిగా, క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బళ్లారి జైలులో 18 నెలలు గడిపిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధునిగా బహుముఖ ప్రతిభా పాటవాలను కలిగిన గొప్ప వ్యక్తి ఘంటసాల అని కీర్తించారు. అటువంటి మహోన్నత గాయకుని శత జయంతి వేడుకల వేళ భారతరత్న ప్రకటించాలని ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 4న ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికా, కువైట్, సింగపూర్ తదితర ఆసియా దేశాల్లో 130కి పైగా కేంద్రాల్లో ఘంటసాల సినీ సంగీత విభావరి ప్రారంభమై వచ్చే ఏడాది డిసెంబర్‌తో ముగుయనుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఘంటసాల శత జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్ కోట అది శేషు, సభ్యులు చల్లా సుబ్బారాయుడు, డి.వి.రమణ, కోట వెంకటేశ్వరరావు, ఎంవివి.నాగేశ్వరరావు, ఎస్ఎస్ఎన్.రాజు, చెన్నా తిరుమలరావు, వడ్డాది గోపాల కృష్ణమూర్తి, జెఎంఆర్ నెహ్రూ, ఎం.తులసీదాసు పాల్గొన్నారు. తొలుత కృష్ణ కుమారిని పలువురు ఘనంగా సత్కరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లాసన్స్ బే కాలనీలోగల మానసిక వికలాంగుల హిడెన్ స్ప్రౌట్స్ ప్రత్యేక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గురుస్థానం ది ప్లే స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. నవభారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని, దానికి తగిన విధంగా సృజనను, మేథస్సును పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. పాఠశాల నిర్వాహకులు శ్రీనివాసరావు, గురుస్థానం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న ఖాన్

ఎయులో మొక్కల పెంపకం కోసం వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని మోడీ పర్యటన, బహిరంగ సభ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తొలగించిన వృక్షాల స్థానంలో మొక్కల పెంపకం చేపట్టాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జెసికి వినతి సమర్పించారు.

నెహ్రూను మరిచారా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి విశాఖలో ఘోర అవమానం జరిగిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. సోమవారం ఆర్‌కె బీచ్‌లోని నెహ్రూ విగ్రహం వద్ద ఆయన ఆందోళన చేపట్టారు. నెహ్రూ జయంతి రోజున ప్రభుత్వం తరఫున ఎవరూ నివాళులు అర్పించేందుకు రాకపోవడం శోచనీయమన్నారు. విశాఖలోనే ఉంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భారత తొలి ప్రధానిని విస్మరించడం దారుణమన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ఐదో గేట్ పార్కింగ్ పాయింట్ వద్ద 10 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. తూర్పు ఢిల్లీకి చెందిన రూబీని విచారిస్తున్నారు.

సమస్యలపై సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ వార్డు సచివాలయం 2వ ఫేజ్ లో జాయిన్ అయిన, ప్రొబేషన్ పూర్తి కాని, పోలీస్ వెరిఫికేషన్ పూర్తి కాని ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్‌ను వేగవంతం చేయాలని గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పివి.కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జివిఎంసి కమిషనర్ రాజబాబుకు వినతిపత్రం అందజేశారు.

బాలల హక్కుల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డివిఆర్.మూర్తి ఆయన ఛాంబర్‌లో ఆవిస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు బాలల కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
S.O.P.No. 38/2022

Between:
1.Smt. Vurigiti Kanaka Mahalakshmi
2. Vurigiti Dhileep Kumar
3. Vurigiti Jaagruthi . . . Petitioners
And:
Muni Shekhar . . . Respondent

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా పైన ఉదహరించిన పిటీషనర్స్ మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విశాఖపట్నంలో ఒకటవ పిటీషనరు గారి భర్త గారు, రెండవ, మూడవ పిటీషనర్స్‌గార్ల తండ్రి గారైన (లేటు) వురిగిటి కన్నారావు, తండ్రి (లేటు) అప్పలస్వామి తేది: 26-04-21 మరణించిన కారణంకి వారసులుగా మరియు అతని Estateకు మరియు (లేటు) వురిగిటి కన్నారావు జీవిత కాలములో మునిశేఖర్ గారికి అప్పుగా ఇచ్చిన రూ.15,35,000/- (పదిహేను లక్షలు ముప్పైఐదు వేలు మాత్రమే) డిమాండ్ ప్రామిశరీ నోటు తేది: 03-08-2019 ద్వారా బాకీ వసూలు నిమిత్తం పైన ఉదహరించిన పిటీషనర్స్ వ్యాజ్యము O.S.No. 272/2022 మహారాజశ్రీ ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, విశాఖపట్నం వారసులుగా నియమించవలసినదిగా కోరుతూ పై కోర్టులో Succession Certificate కోసం పై కోర్టు వ్యాజ్యము తెచ్చినందున ఎవ్వరికైననూ ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్నయెడల పై కోర్టులో **05-12-2022న ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని మీ అభ్యంతరములు తెలియజేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఆర్డరు చేయడమైనది. మీ ఆక్షేపణలు లేనియెడల కోర్టు వారు విచారణ చేసి పై పిటిషనర్స్ పేరున Succession Certificate జారీ చేయబడును.

(By Order of the Honourable Court)
SKSK SARMA
Advocate, Lalitha Nagar, VSP.
Cell : 98492 30073, 9849589945

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, గాజువాక
ఒ.ఎస్. నెం. 142 / 2010

బిట్వీన్:
కొప్పిర్ల సన్యాసిరాజు మరియు యింకొకరు . . . వాదులు
మరియు:
కొవ్వూరు చంద్రవేణి @ చంద్రావతి వేణ మరియు యింకొందరు . . . ప్రతివాదులు

నోటీసు టు 13వ ప్రతివాది:
నాసపు వైకుంఠరావు,
తండ్రి నాసపు రామారావు,
ప్లాట్‌నెం. 85/19, ఆటోనగర్,
విశాఖపట్నం-13.

నోటీసు టు 14వ ప్రతివాది:
బనిశెట్టి ఉషాకుమారి,
భర్త వీరవెంకట ప్రకాశరావు
ప్లాట్‌నెం. 85/19, ఆటోనగర్,
విశాఖపట్నం-13.

పై దావాలో వాదులిరువురు ఉమ్మడి ఆస్తి పంపకము నిమిత్తం మొదటి ప్రతివాది మరియు ఆమె యొక్క వారసులపై మరియు మీ పైన వేసియున్నారు. ఆ దావా వాయిదా మీ యొక్క హాజరు నిమిత్తం **తేది: 21-11-2022కు** వేసియున్నారు. కావున మీరు తేది: **21-11-2022న ఉదయం 10-30 ని॥లకు** శ్రీకోర్టు వారి ముందు హాజరయ్యి మీ యొక్క వాదన ఏమైన ఉన్నయెడల తెలియపర్చ కోవలసినది. లేనియెడల మీ పరోక్షములో శ్రీకోర్టు వారు చట్ట ప్రకారము తీర్మానించెదరని శ్రీకోర్టు వారి యొక్క ఆర్డరు ప్రకారము తెలియజేయుచున్నాము.

B.MURALI KRISHNA RAJU
K.SATYA VANI
B.DEVA KIRAN RAJU
Advocates
Plot No. 109 and 110, Bhavaninagar, B.C.Road, Gajuwaka, Visakhapatnam.
Cell : 9393260078

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT YELLAMANCHILI
O.S. No. 218 /2021

Between:
Smt. Nakanaboina Nookaratnam & Others . . . Plaintiffs
And:
Sri Lalam Nageswara Rao . . . Defendant

SUMMONS

To:
Lalam Nageswara Rao,
S/o. Pydithalli,
Santhapalem Village,
Velechuru Post, Rambilli Mandal,
Visakhapatnam Dist.

Please take notice that the above named plaintiffs have instituted the above suit against you for recovery of an amount of Rs. 1,71,200/- (Rupees One Lakh Seventy One Thousand Two Hundred Only) with subsequent interest, costs and other reliefs and the same stands posted to 21-11-2022 for your appearance and on that day, you are personally or through an advocate attend before the Honourable Court at 10-30 A.M. failing which, the matter will be heard and determined in your absence experte asper law.

(By Order of the Honourable Court)
L.V.RAMAKRISHNA RAO
Advocate
Yellamanchili
Mobile No: 9440596613

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 1370 /2019 in O.S.No. 238/2019

Between:
Garikina Masenu . . . Petitioner / Plaintiff
And:
Kosetti Nookamma and another . . . Respondents / Defendants
To:
2nd Respondent / Defendant :
Kosetti Varalakshmi,
W/o. (Late) Srinu, aged 25 years,
Hindu, Housewife,
Resident of Chinateenarla Village,
Nakkapalli Mandal, Anakapalli Dist.

నోటీసు

పై నెంబరు దావా/పిటిషన్‌లో 2వ ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపిననూ మీకు చేరనందున ఈ పేపరు ప్రకటన ద్వారా **తేది: 06-12-2022 దిన ఉదయం 10-30 ని॥లకు** వాయిదా విషయాన్ని తెలుసుకుని పై కోర్టుకు మీరు స్వయంగా లేక మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపగలరని లేని పక్షంలో సదరు దావా/పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

జె.వి.బి.ఎస్.ఆర్.శాస్త్రి
అడ్వకేట్,
యలమంచిలి
యలమంచిలి
తే: 14-11-22 సెల్: 98488 35323

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టువారి సముఖమునకు
OS No : 68/2017

వాదులు : శ్రీమతి రావుపల్లి మీనాకుమారి వగైరాలు
VS
ప్రతివాదులు : శ్రీ కస్పా జగన్‌మోహనరావు వగైరాలు

D 8 :- శ్రీ రేగిడి సంపత్ కుమార్, S/o లేటు ఉమామహేశ్వరరావు, R/o డోర్ నెం : 11/275/1, ఆక్సిస్ బ్యాంక్ ATM ప్రక్కన, రామకృష్ణానగర్, గోపాలపట్నం, విశాఖపట్నం.

D 10 :- శ్రీమతి గొట్టిపల్లి సత్యశ్రీ, W/o నగేష్, R/o Opp వాటర్ టేంక్, చెలూరు, విజయనగరం జిల్లా.

పై నెంబరులో తమ కోర్టువారి ఆర్డరు ప్రకారము సదరు ప్రతివాదులు 8 మరియు 10 పలు పర్యాయములు కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను సమన్లు పంపగా అమలు కానందుకు గాను పై కోర్టులో **తే 23-11-2022దిన ఉదయం 10-30ని॥**లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలయును. లేని యడల మీ పరోక్షమున తీర్మానించుదురు.

వై. సత్యశ్రీనివాస్
వాది తరపు న్యాయవాది,
రాజాం
రాజాం
తేది: 14.11.2022 సెల్ : 8309885495

ఉచిత మధుమేహ రక్త పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి పిలుపు మేరకు వైజాగ్ అపోలో ఆసుపత్రి ఆధ్వర్యాన సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో ఉచిత మధుమేహ రక్త పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి సిఇఒ జె.రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ షాపింగ్ కాంప్లెక్స్‌లు, బీచ్ రోడ్డు, ప్రముఖ సంస్థల్లోను, అపోలో ఫార్మసీ నందు సుమారు 5,000 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా సామాన్యులకు అందుబాటులో డయాబెటిక్ స్క్రీనింగ్ ప్యాకేజీని అపోలో ఆసుపత్రిలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- మధురవాడ : ఏడవ వార్డు పరిధిలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కృషి చేస్తానని ఆ వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ చెప్పారు. సోమవారం మంగమ్మ ఆమె భర్త టిడిపి నాయకుడు పిళ్ళా వెంకటరావుతో కలిసి మొగధారమ్మ కాలనీలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైను పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీ నిర్మాణం నుంచీ తాగునీరు తదితర సమస్యలుపై ప్రజల ఇబ్బందులను కౌన్సిల్‌లో పెట్టి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. మిగిలిన సమస్యలు కూడా తొందర్లోనే పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాలనీవాసులు పలువురు కార్పొరేటర్‌కు అభినందనలు తెలిపారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి

ప్రజాశక్తి- భీమునిపట్నం : పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర కమిటీ రూపొందించిన రియల్ టైమ్ స్టాటజీ (ఆర్‌టిఎస్) గ్రూప్ ద్వారా పార్టీ విధి, విధానాలతో పాటు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేయాలని శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ఆర్‌టిఎస్ బృంద సభ్యులు పి.జాన్, ఎ.మహేష్, వి.చైతన్య, వెంకటశ్యామ్ సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె లీలావతి, పిల్ల వెంకటరావు, బడిగింటి నీలకంఠం, ఎస్.గణేష్‌రెడ్డి, పతివాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండలం ముదపాకలో జగనన్న ఇళ్ల కాలనీని జనసేన నాయకులు పరిశీలించారు. 'జగనన్న ఇళ్లు -పేదలందరికి కన్నీళ్లు' అని నినదించారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ, పేదల భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకొని వారిని ఇబ్బందులకు గురిచేశారన్నారు. న్యాయస్థానానికి కూడా గౌరవం ఇవ్వకుండా కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రైతుల భూములను కొండ పోరంబోకుగా చిత్రీకరించి అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదని తెలిపారు. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్న దళిత రైతులకు జనసేన అండగా ఉంటుందన్నారు. ఒక్కలబ్ధిదారునికి అన్యాయం జరిగినా తమ పార్టీని సంప్రదిస్తే వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మధు, శ్రీకాంత్, పిన్నింటి పార్వతి పాల్గొన్నారు.

సొసైటీగా మధురవాడ పిఎసిఎస్?

ప్రజాశక్తి -మధురవాడ : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) త్వరలో క్రెడిట్ సొసైటీగా సేవలు అందించనుంది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. సుమారు 50 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పిఎసిఎస్ ద్వారా ఒకప్పుడు మధురవాడ పరిసరాల్లోని 20 గ్రామాల రైతులకు సేవలు అందేవి. అప్పట్లో వ్యవసాయమే జీవనాధారం కావడంతో రైతుల కోసం ఈ పిఎసిఎస్‌ను ప్రారంభించారు. కాలక్రమంలో మధురవాడ పరిసరాల్లో వ్యవసాయం కనుమరుగైంది. పిఎసిఎస్ సభ్యుల సంఖ్య కూడా తగ్గింది. దీంతో పిఎసిఎస్ నుంచి రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పదేళ్ల క్రితం నుంచి దీన్ని క్రెడిట్ సొసైటీగా మార్పుచేయాలని ఆ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత నెలలో జరిగిన సొసైటీ మహాజన సభలో కూడా సభ్యులంతా సొసైటీని క్రెడిట్ సొసైటీగా మార్పు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రస్తుతం దీనిపై కదలిక వచ్చినట్లు తెలిసింది. ఫైల్ డివిజనల్ స్థాయి అధికారి నుంచి గుంటూరు వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అక్కడ ఆమోదంకాగానే ఉత్తర్వులు రానున్నాయి. ఈ ప్రక్రియ నెల రోజుల్లో పూర్తి కానున్నట్లు తెలిసింది. క్రెడిట్ సొసైటీగా మార్చితే అర్బన్ బ్యాంకులో జరిగే కార్యకలాపాలన్నీ ఇక్కడ కూడా జర గనున్నాయి. హౌసింగ్, వ్యక్తిగత వాహన రుణాలతో పాటు అధిక వడ్డీకి డిపాజిట్లు కూడా స్వీకరిస్తారు.

మా కుమారుని ఆచూకీ కనుగొనండి

సిఐ, తహశీల్దార్‌కు తల్లిదండ్రుల విజ్ఞప్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి పరిధి కాపులుప్పాడ సచివాలయం విఆర్ఒ బడే శ్రీను ఆచూకీ కనుగొనాలని అతని తల్లిదండ్రులు కొర్లమ్మ, చిన్నారావు సోమవారం సిఐ కె.లక్ష్మణమూర్తి, తహశీల్దారు కోరాడ వేణుగోపాల్‌కు విజ్ఞప్తి చేశారు. మంగమారిపేటకు చెందిన బడే శ్రీను ఇటీవల అదృశ్యమైన విషయం విధితమే. ఈ నెల 4వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరం వెళ్లినట్లు అక్కడి సిసి పుటేజీల ఆధారంగా తేలిందని కుటుంబ సభ్యులు వివరించారు. 5వ తేదీ రాత్రి 8-55 గంటల వరకు మొబైల్ ఆన్‌లో ఉందని, తర్వాత స్విచ్ ఆఫ్ అయిందని తెలిపారు. ఇంకా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తల్లిదండ్రులు వివరించారు. వీరితో పాటు వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, గ్రామ పెద్దలు దూడ అచ్చారావు, ఎం.చిన్నారావు, మహిళలు పోలీసు స్టేషన్‌కు, తహశీల్దారు కార్యాలయానికి చేరుకుని శ్రీను ఆచూకీ లభించక ఆందోళన వ్యక్తంచేశారు.

దీనిపై తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ అదృశ్యం వెనుక బలమైన కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో అన్వేషిస్తామని తెలిపారు. కాపులుప్పాడ ప్రాంతంలో అక్టోబర్ 1 నుంచి భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు, వివాదాలపై కూడా విచారిస్తామని చెప్పారు. బడే శ్రీను జెవి అగ్రహారంనకు కూడా విఆర్ఒగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సహకరిస్తే అభివృద్ధి చేస్తా : సర్పంచ్ బంటుకుమారి

ప్రజాశక్తి- ఆనందపురం : దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని భీమన్నదొరపాలెం గ్రామ సర్పంచ్ బంటు కుమారి పేర్కొన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గండ్రెడ్డి శ్రీనివాసరావు సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న తన మామ బంటు చిన్నరాములమ్మ (మాజీ సర్పంచ్) కుటుంబంలో తన భర్త బంటు అప్పలస్వామి (చిన్న) సాయంతో అభివృద్ధి పనులు చేస్తానన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. పెద్ద చెరువు, ఊరచెరువు, పెద్దమ్మ చెరువు, సురపు చెరువు, అమ్మన్న చెరువులకు మధుములు, కల్వర్టులు ఏర్పాటుచేసి నీటి నిలువలను పెంచి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భీమంద్రపాలెం, బంటు మెరక గ్రామాలలో సుమారు రూ.2 కోట్లతో మౌలిక వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దానన్నారు. గ్రామంలో సెల్ టవర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ తీసుకొని గ్రామాభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు.



సర్పంచ్ బంటు కుమారి

సుగర్ వ్యాధి నివారణకు వ్యాయామం

ప్రజాశక్తి -గాజువాక : సుగర్ వ్యాధి నివారణకు ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి అని ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.హేమలత పేర్కొన్నారు. ప్రపంచ సుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా గాజువాకలోని ఎంవిఆర్ కళాశాలలో సోమవారం సుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా సుగర్ వ్యాధి నియంత్రించవచ్చని తెలిపారు. శరీరాన్ని కష్టపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్‌కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎంవివి సిటీలో 30 తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధి క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న ఎంవివి సిటీలో భారీగా బంగారం చోరీ జరిగినట్లు పిఎం.పాలెం నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. నేర విభాగం సిఐ రమేష్ కథనం ప్రకారం... ఎంవివి సిటీ తొమ్మిదవ బ్లాక్ లోని 9055 ఫ్లాట్ నెంబర్‌లో కె.పూర్ణిమ నివాసం ఉంటున్నారు. ఈమె ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఆమె 30 తులాలకుపైగా బంగారాన్ని ఇంట్లో భద్రపరిచారు. ఆదివారం బీరువాలో ఉన్న బంగారం కనిపించకపోవడంతో పిఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదానీ గంగవరం పోర్టులో 'స్వచ్ఛ భారత్'

ప్రజాశక్తి-గాజువాక: అదానీ గంగవరం పోర్టులో 'స్వచ్ఛ భారత్, స్వచ్ఛ పోర్ట్' అనే ఉద్యోగి స్వచ్ఛంద కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మందికి పైగా ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్లు, డ్రెయిన్లలోని ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా పోర్టు సిఇఒ బిజి.గాంధీ మాట్లాడుతూ, మనం నివసించే, పనిచేసే కమ్యూనిటీల సహజ సౌందర్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అదానీ గంగవరం ఓడరేవులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, పరిశుభ్రతను నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

సిఎమ్‌డిని కలిసిన ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి- ములగాడ: హిందూస్తాన్ షిప్‌యార్డులో ఇటీవల జరిగిన ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలలో విజయం సాధించిన సభ్యులంతా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రిని, ఇతర డైరెక్టర్లను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు చైర్మన్ అభినందనలు తెలిపారు. షిప్‌యార్డు అభివృద్ధికి సంఘ సభ్యులంతా కృషిచేయాలని, రానున్న ఆర్డర్లను సకాలంలో పూర్తిచేయాలని కోరారు. సంస్థ అభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.అనీల్‌కుమార్, ప్రెసిడెంట్ కె.అప్పలకొండ, గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రటరీ అనీల్‌కుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

డిసెంబర్ 17న గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2001 సంవత్సరం నుంచి 2007 సంవత్సర కాలంలో వివిధ కోర్సులు అభ్యసించి దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులకు డిసెంబర్ 17న "హోమ్ కమింగ్-2022" పేరిట అంతర్జాతీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెలిపారు. 42 సంవత్సరాల గీతం సుదీర్ఘ చరిత్రలో దాదాపు లక్ష మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సులను పూర్తిచేసి ప్రముఖ సంస్థలలో కీలక స్థానాలకు ఎదిగారని, అమెరికా తదితర దేశాలలో గీతం పూర్వ విద్యార్థి సంఘాలు చైతన్యవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం వహించడంతో పాటు సిలబస్ రూపకల్పనలో నూతన అంశాలపై పూర్వ విద్యార్థుల విలువైన సూచనలు పరిగణలోకి తీసుకుంటున్నామన్నారు. పూర్వ విద్యార్థుల కోసం ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పామని తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో సోమవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి.

సింహాచలం: సింహాచలం గ్రంథాలయంలో గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసిరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి మూర్తి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో రీడర్స్ ఫోరం అధ్యక్షులు బిబి.రాజేంద్రప్రసాద్, ఏడుకొండలు, భాను పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, సామాజిక కార్యకర్త టి.శ్రీరామ్మూర్తి, కార్మిక నాయకులు బి.సత్యానందం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, ప్రముఖ పాత్రికేయులు ఎస్.చలపతిరావు తదితరులు ప్రసంగించారు.

సెయింట్ ఆన్స్ కళాశాల లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాలను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి ప్రారంభించారు. గ్రంథాలయాలకు వచ్చి నిరంతరం గ్రంథాలను చదవడం ద్వారా వ్యక్తిత్వం వికసిస్తుందని, జ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి జి.శిరీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో వై.అనసూయాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతమ్మధార : రంగ సాయి నాటక గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించారు. నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్ఎన్ఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన చమత్కార రత్నావళి, కన్యాశుల్కం, వ్యవహార ధర్మబోధిని నాటకాలపై చర్చ నిర్వహించారు. సీనియర్ నటులు పిసిహెచ్.నాయుడు, ఎం.శివజ్యోతి, ఆంధ్ర కళాపరిషత్ రంగస్థలం విభాగం పూర్వపు విద్యార్థులు సందీప్, మహిళా నటీమణులు, సహాయ గ్రంథ పాలకులు జమ్మా చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయం అధ్యక్షులు డాక్టర్ సమపనేని విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పోలీస్ స్టడీస్ కార్యదర్శి ప్రసన్నకుమార్, గ్రంథాలయం కార్యదర్శి డిఎస్.వర్మ, గ్రంథాలయం సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



పబ్లిక్ లైబ్రరీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

గర్వించదగ్గ చిత్రకారుడు పైడిరాజు

ప్రజాశక్తి -ములగాడ : అంట్యాకుల పైడిరాజు దేశం గర్వించదగ్గ చిత్రకారుడు, శిల్పి అని ప్రముఖ ఉపాధ్యాయ ఉద్యమకారులు బి.వెంకటపతిరాజు వేణు అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో అంట్యాకుల పైడి రాజు 103వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పైడిరాజు చిత్రీకరించిన చిత్రాలు అమెరికా, రష్యా, లండన్, సింగపూర్, పోలాండ్ తదితర దేశాల్లో ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శించారని తెలిపారు. ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చిందన్నారు. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న గురజాడ విగ్రహాన్ని ఆయనే తయారుచేశారని తెలిపారు. ఆయన చిత్రాలు జానపద కళారూపాలపై ఉండేవన్నారు. ఆయన చిత్రాలను సేకరించి గ్రంథాలయాల్లో భద్రపరచాలని కోరారు. ప్రముఖ పాత్రికేయులు ఎస్.చలపతిరావు మాట్లాడుతూ, అంట్యాకుల పైడిరాజును యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాస్ మనోహర్, జివిఎస్ఎన్.రాజు, ఇపిఎస్.భాగ్యలక్ష్మి, కె.సత్తిరాజు, బి.సత్యానందం, జికెవి.రాజు, టి.రామమూర్తి పాల్గొన్నారు. ముందుగా అంట్యాకుల పైడిరాజు చిత్రపటానికి టి.శ్రీరామ్మూర్తి పూలమాలను వేసి నివాళులర్పించారు.

అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగి సత్తా

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని క్రీడా విభాగంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన 42వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో తొమ్మిది జిల్లాల నుంచి మొత్తం 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలో స్టీల్ ప్లాంట్ కోక్‌ఓవెన్ సిఎస్‌పి విభాగంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సినపరశెట్టి మోహన్ 3 పతకాలు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు, 400 మీటర్ల పరుగులో వెండి, 1500 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. మోహన్‌ను స్టీల్ సిఐటియు అధ్యక్షులు జె.అయోధ్యరామ్, కెఎం.శ్రీనివాస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు అభినందించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేవిధంగా భవిష్యత్తులో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఫిబ్రవరి 11, 12 తేదీల్లో కోల్‌కత్తాలో జరిగే నేషనల్ అథ్లెటిక్ పోటీలకు సన్నద్ధం అవుతున్నట్టు మోహన్ తెలిపారు.


మోహన్

ప్రధాన న్యాయమూర్తిగా గోపి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చిన గుత్తుల గోపి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ లాయర్లు బగాది తులసీదాస్, ఆర్.శ్రీనివాసరావు, కుప్పిలి మురళీధర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ కరుణశ్రీ, సిబ్బంది రమణి, రత్నం, శిరీష, సూర్య వెంకటలక్ష్మి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.


ప్రధాన న్యాయమూర్తికి అభినందనలు తెలుపుతున్న బులికృష్ణ తదితరులు

పప్పల రామ్మోహనరావుకు సత్కారం



రామ్మోహనరావును సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ప్రజాశక్తి-మాధవధార : ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పప్పల రామ్మోహనరావును మాధవధారలోని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాధవధార రైల్వే కార్మిక సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు పప్పల రామచంద్రరావు మాట్లాడుతూ, రైల్వే కార్మికుల సంక్షేమం కోసం ఆయన సేవలు గుర్తించిన యూనియన్ నాయకులు ప్రధాన కార్యదర్శిగా నియమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వావిలపల్లి వెంకట్రావు, యూనియన్ నాయకులు పప్పల శ్రీహరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధిలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.37 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు వెంకటరావు, డిఇ ఎంఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వారపు సంత ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సత్యసాయినగర్‌లో వారపుసంత మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుందని విశాఖపట్నం ఫుట్ పాత్ వ్యాపారస్తుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు నక్క కృష్ణ తెలిపారు. ఈ వారపు సంతను 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ ప్రారంభిస్తారని చెప్పారు. సత్యసాయి నగర్, వరహగిరి కాలనీ, గణేష్‌నగర్, నరసింహనగర్, పోర్టు క్వార్టర్లు, సింగల అమ్మపురం, సింహగిరి కాలనీ, శాంతినగర్ గ్రామ ప్రజలు ఈ సంతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సత్యసాయినగర్ గ్రామ అధ్యక్షులు కారుకొండరాజు యాదవ్, గ్రామ కమిటీ సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం కంచరపాలెం మెట్లు వద్ద ఉన్న జివిఎంసి హైస్కూల్లో విద్యార్థులకు "నేటి చదువులే రేపటి వెలుగులు" అనే అంశంపై బిఎన్‌ఆర్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాస్, టీచర్లు పి.సావిత్రి, సిహెచ్.జయలక్ష్మి, హరినారాయణ సహకారంతో నిర్వహించిన పోటీల్లో విజేతలకు లయన్స్ క్లబ్ ద్వారకానగర్ అధ్యక్షులు కె.సత్యనారాయణ, కె.స్వతంత్రకుమార్, పిజె.లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు.

పివిజి.రాజుకు నివాళి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం ధర్మకర్త కీర్తిశేషులు పివిజి.రాజు 27వ వర్ధంతిని కృష్ణాపురం గోశాల వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్.ఆనంద్‌కుమార్, వై.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ విభాగం ఇఇ రాంబాబు, ఉద్యోగ సంఘం నాయకులు హరిరాజు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా పలు పాటశాలల్లో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పద్మనాభం : మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను ఎంపిపి రాంబాబు అందించారు. అనంతరం పౌరాణిక, రంగస్థల కళాకారుడు, జీవన సాఫల్య అవార్డు గ్రహీత సామవేదం బాలసుబ్రమణ్యాన్ని సన్మానించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.సన్యాసమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ, హెచ్‌ఎం సన్యాసిరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు. చిట్టివలస శ్రీ రామకష్ణా విద్యాలయంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కెఎస్‌ఎం.సుధాకర్, వైసిపి శిష్ట కరణ మహిళా ఉపాధ్యక్షులు బి.ప్రశాంతి, విశ్రాంత హెచ్‌ఎం పార్వతి, పాఠశాల డైరెక్టర్లు ఎంవి.శివసాయికుమార్, ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆరిలోవ : బాలల హక్కుల వారోత్సవాలు, చైల్డ్‌లైన్ సే దోస్తీ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ బాలుర, బాలికల గృహం, చైల్డ్‌లైన్ 1092 సంయుక్త ఆధ్వర్యాన సోమవారం బాలల దినోత్సవాన్ని ఆయా గృహాల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెకెవి.బులికృష్ణ ముఖ్యఅతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రొఫెసర్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మండా రజని, టి.విజయలక్ష్మి, పలు సంస్థల ప్రతినిధులు యల్లయ్య, సిహెచ్.విశాలాక్షి, కెఎల్‌ఆర్.రాధ, సూర్యనారాయణ, జి.డేవిడ్ రాజు, వీరయ్య, సునీత పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం : వడ్లపూడిలోని నిర్మల ఇంగ్లీషు మీడియం స్కూల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ జూలియట్, ఫాదర్ రత్నకుమార్, పిఇటి సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరం సృష్టి వరల్డ్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. "నేటి బాలలే రేపటి పౌరులు" అనే అంశంతో వ్యాసాలను విద్యార్థులు రాశారు. పేపర్‌క్రాఫ్ట్ పోటీలో భాగంగా పండిట్ నెహ్రూ త్రిడి చిత్రాలను తయారు చేశారు. బాలబాలికలు జవహర్ లాల్ నెహ్రూ వేషధారణలో వచ్చి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలనే నాటికను విద్యార్థులు ప్రదర్శించారు. మార్షల్ ఆర్ట్స్, వివిధ పోటీలలో పతకాలు సాధించిన విజేతలకు పాఠశాల డైరెక్టర్ పి.సుశీలరాణి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇ.చంద్రిక, వైస్ ప్రిన్సిపాల్ కావ్య భాయ్ పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి టిఎన్‌ఆర్ టాలెంట్ స్కూల్లో నెహ్రూ చిత్రపటానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, స్కూల్ డైరెక్టర్ తిప్పల వంశీ రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత పాల్గొన్నారు.

ఆనందపురం : గొట్టిపల్లి న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ శ్యామ్ మాథ్యూస్, ప్రిన్సిపల్ జయ శ్యామ్ ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వేములవలస ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు సొంత నిధులతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, సుభాషిని పాల్గొన్నారు. అనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి అమర్‌నాథ్ రూ.10 వేలు ఆర్థిక సాయంతో అందజేసిన 300 కాపీరైట్ పుస్తకాలు, మ్యాథ్స్ ఒలింపియాడ్ పుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వైపి కెజియా, ఉపాధ్యాయులు కెఆర్‌కె పట్నాయక్, బంగారం తదితరులు పాల్గొన్నారు. నేలతేరు కస్తూరిబా గాంధీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాన్స్, జిల్లాస్థాయి యోగా పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను కేజీబీవీ ప్రత్యేక అధికారి చంద్రకళ అభినందించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ములగాడ : విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన 62వ వార్డు పరిధి త్రినాధపురంలో నెహ్రు చిత్రపటానికి ఎంఆర్‌కె.జనార్ధన్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విసిసి మల్కాపురం జోన్ కన్వీనర్ ఇ.అరుణ, ఎస్‌విఎస్ సుధారాణి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షులు పారిజాత సత్పతి అధ్యక్షతన నిర్వహించారు. ఎల్‌కెజి, యుకెజి, నర్సరీ విద్యార్థులకు బొమ్మలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు మధుస్మిత సాహూ, ప్రియాంక, కార్యదర్శి శ్రీదేవి పాల్గొన్నారు. కేంద్రీయ విద్యాలయ (వాల్తేరు)లో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న నాగిరెడ్డి


శ్రీ రామకష్ణా విద్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు


నిర్మల ఇంగ్లీషు మీడియం స్కూల్లో....


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కోరాడ నవీన్

పరుగు పందెంలో భాగ్యలక్ష్మి సత్తా

ప్రజాశక్తి-మాడుగుల : జిల్లా స్థాయి 1500 మీటర్ల పరుగు పందెంలో మండలంలోని జి.అగ్రహారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచింది.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అనకాపల్లిలో జరిగిన 1500 మీటర్ల (అండర్ 17) విభాగంలో ఈ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మాడిసి భాగ్యలక్ష్మి తృతీయ స్థానంలో నిలిచింది. సదరు విద్యార్థినితో పాటు కోచ్, పిఈటి వి.రాజులను హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు చంద్రరావు, అప్పలమూర్తిలు అభినందించారు.

బుల్లితెర నటుడు సత్తిబాబు మృతి



సత్తిబాబు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాది గ్రామానికి చెందిన బుల్లితెర నటుడు బత్తుల సత్తిబాబు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వడ్డాదికి చెందిన సత్తిబాబు రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో నటుడిగా, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పని చేశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్తిబాబు చికిత్స పొందుతూ హైదరాబాదులో మతి చెందాడు. దీంతో వడ్డాదిలోని విషాదఛాయలు అలుముకున్నాయి. కథ, ఈగ సినిమాలోనూ, అమృతం డైలీ సీరియల్లో నటించారు. సుదీర్ఘకాలం జస్ట్ ఎల్లో బ్యానర్లో ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పని చేశారు. సత్తిబాబు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక గ్రామంలో అగ్ని ప్రమాద బాధితుడు కారి నూకరాజు కుటుంబానికి సోమవారం జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ తన సొంత నిధులు లక్ష రూపాయలను అందజేశారు. పూడిమడక గ్రామంలో సోమవారం ఆయన పర్యటించి నూకరాజు కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుందరపు సతీష్ కుమార్, చోడిపల్లి అప్పారావు, మెరుగు ప్రవీణ్, ఎం.శ్రీవేణి, ఒడిసెల నాయుడు, ఎస్.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో గౌరీ పరమేశ్వరుల సారే ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఎడ్ల బండిపై ఈ సారే ఊరేగింపు అగ్రభాగాన నిలిచారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు మండల నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో దేవరాపల్లి గ్రామమంతా కిటకిటలాడింది. స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనసాగిన మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి : హెటిరో పైప్‌లైన్ పూర్తిగా తొలగించే వరకు రాజీలేని పోరాటం చేస్తామని మత్స్య నాయకులు స్పష్టం చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహాధర్నా సోమవారం నాటికి 350వ రోజుకు చేరింది.మత్స్యకారులు పైప్ లైన్ కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.కంపెనీ కాలుష్య ప్రభావం కారణంగా ఈ ప్రాంతంలో మత్స్య సంపద నశించి పోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార జేఏసీ జిల్లా అధ్యక్షులు పిక్కి స్వామి, నాయకులు గోసల స్వామి పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట బాలురు హైస్కూల్‌కు ఆ పాఠశాల 1982-83 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బి.రమేష్ బాబు, చిన్నారావు 500 లీటర్ల ఆర్ఓ ప్లాంట్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీధరరెడ్డి మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు వితరణ చేయడం అబినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.ప్రభాకర్ రావు, దేవానంద్, అచంటి రవి, రామారావు, అప్పారావు శేషు కుమారి, సుధారాణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్ఓ ప్లాంట్ అందించిన పూర్వ విద్యార్థులు

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకోవాలి

తహశీల్దారుకు సిపిఎం వినతి



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట గ్రామంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని మండల తహశీల్దారు ఎం.లక్ష్మికి స్పందన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరభద్రపేట సమీపంలో సుమారుగా ఆరు ఎకరాలు అసైన్డ్ భూమిని కె.కోటపాడు మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన గొర్లె వెంకటలక్ష్మి (ఈమె భర్త వెంకట అప్పారావు దేవరాపల్లి డిసిసిబి బ్యాంకు మేనేజర్) గిరిజనులు నుండి లీజుకు తీసుకొని పామాయిల్ తోటలు వేశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ బోరు నిమిత్తం విద్యుత్ కనెక్షన్ కూడా తప్పుడు మార్గంలో పొందారని వెల్లడించారు. ఈ భూమిని స్వాధీనం చేసుకొని పేద గిరిజనులకు అప్పగించాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడిన లీజుదారుని భర్త వెంకట అప్పారావుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ కనెక్షన్ తొలగింపు

సోమవారం పత్రికల్లో వచ్చిన వార్తలకు విద్యుత్ అధికారులు స్పందించి లీజుదారు గొర్లె వెంకటలక్ష్మికి అగ్రిమెంటుపై ఇచ్చిన విద్యుత్ కనెక్షన్ విద్యుత్ శాఖ అధికారులు సోమవారం తొలగించినట్లు వెంకన్న తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -పాయకరావుపేట

మండలంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం పర్యటించారు. గోపాలపట్నం గ్రామంలో ఉమా ధర్మ లింగేశ్వర స్వామి దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావుతో కలిసి సోమవారం మంత్రి అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ, సీతమ్మ వారి మెట్ట మీదకు రహదారి నిర్మించడానికి అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, స్థానిక సర్పంచ్ పన్నీర్ పాపారావు, నియోజవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

స్పందనకు దరఖాస్తుల వెల్లువ



సమస్యలు వింటున్న కలెక్టర్ రవి, జెసి కల్పనాకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 166 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జెసి కల్పనాకుమారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం సీతామహాలక్ష్మి ఇందులో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారుడు మొదటిసారి అర్జీ పెట్టినప్పుడే సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, మళ్లీ పునరావృతం కాకూడదని అధికారులను ఆదేశించారు. దరఖాస్తు దారునికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 30

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 30 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ గౌతమి శాలి నేరుగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో చట్ట పరిధిలో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాల తొలగింపు

ప్రజాశక్తి- సబ్బవరం : జివిఎంసి 88వ వార్డు వెదుర్లనరవలో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ వెదుర్లనరవ సర్వే నెంబర్ 35లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీని, సర్వే నెంబర్ 128 డి.పట్టా భూమిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్‌లను తొలగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిటి వెంకట్, వీఆర్వో వెంకటేష్, సర్వేయర్ కె.శ్రీనివాసరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

16న ఎపి కౌలు రైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా 4వ మహాసభ ఈనెల 16న స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో నిర్వమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు టెక్కలి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఎ.బాలకష్ణ, అనకాపల్లి, అచ్యుతాపురం, మునగపాక, కసింకోట మండల నాయకులు తేలయ్య బాబు, కె.రామ సదాశివరావు, ఆళ్ల మహేశ్వరరావు, డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు, కౌలు రైతుల గుర్తింపు కార్డులు, రుణ సౌకర్యం, ఎరువులు విత్తనాలపై రాయితీలు, పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు, డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల అమలు, అన్ని పంటలకు కనీస మద్దతు ధర చట్టం వంటి అంశాలను చర్చించడం జరుగుతుందని వెల్లడించారు.

పైపులైన్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని మూలపేటలో స్థానిక వాటర్ ట్యాంక్ నుండి శ్మశాన వాటిక వరకు కొత్తగా పైపులైను నిర్మాణానికి సోమవారం సర్పంచ్ గంగ అప్పలనాయుడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించడానికి గ్రామస్తులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, గ్రామ పెద్దలు బీశెట్టి పైడికొండ, కాండ్రేగుల రాము, బొడ్డెడు సూరి అప్పారావు, ఆడారి రాము, బొడ్డెడ నాగరాజు కాండ్రేగుల అప్పారావు, బొడ్డేడ దినేష్ పాల్గొన్నారు.

వైభవంగా శూలాల మహోత్సవం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి గ్రామంలో సాంబశివుని శూలాల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్వతీ సాంబశివులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్నాథ్, శాసనసభ్యులు యువి.రమణ మూర్తి రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, జడ్పిటిసి స్వామి సత్యనారాయణ, వైసీపీ నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టిడిపి నాయకులు మళ్ల సురేష్, కడియం అనురాధ, దొడ్డి శ్రీనివాసరావు, శరగడం యోగి నాగేశ్వరరావు గ్రామ సర్పంచ్ జామి చిన్నమ్మలు, మాజీ సర్పంచ్ ఎల్లపు భాస్కరరావు, వైస్ ఎంపీపీ చెందాడ దేవి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్ తదితరులు సాంబశివుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పట్టభద్రుల ఓటర్ల వివరాలు పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రులు నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓట్లు నమోదు చేసుకున్న పట్టభద్రుల వివరాలను మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అధికారులు పరిశీలించారు. నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రమీలా గాంధీ వీటిని పరిశీలించారు. దిబ్బిడి, బుచ్చయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో ఇటీవల ఓట్లు నమోదు చేసుకున్న పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఇంటి అడ్రస్సులు దరఖాస్తులో గల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో ఎర్రయ్య, మణి, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కె.కోటపాడు : ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగు గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని స్థానిక గ్రంథాలయ అధికారి కె.సౌమ్య కోరారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయం వద్ద సోమవారం ఎంఇఒతో కలిసి గ్రంథాలయ వారోత్సవాల పోస్టను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పక్షం రోజులు గ్రంథాలయం వద్ద వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాఠకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ, గ్రంథాయాధికారి తదితరులు


విరాళం అందజేస్తున్న ఎంవిఆర్ యువసేన ప్రతినిధులు

అన్న సమారాధనకు విరాళం

ప్రజాశక్తి - రాంబిల్లి : ముత్యాల ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు యువసేన సభ్యులు సోమవారం మండలంలోని దిమిలి గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఆలయానికి దర్శించుకున్నారు. అక్కడ సుమారు 5000 మందికి నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి ఎంవిఆర్ ట్రస్ట్ తరుపున రూ.5వేలు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కడిమి వెంకట్, చక్కల శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, నానాజీ, మూర్తి, వెంకటేష్, శ్రీను, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

శాలివాహనుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో కుమ్మరి శాలివాహనుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కుమ్మరి శాలివాహనుల సంక్షేమ సంఘం చైర్మన్ ఎ.పురుషోత్తం, డైరెక్టర్ డి.ఎ.వెంకటరావు ఆధ్వర్యాన సోమవారం కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతి పత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నుంచి నలుగురు సభ్యులను నియమించారు. తీడ గ్రామానికి చెందిన కొత్తూరు జయమ్మ, నరసయ్య పేట నుంచి శ్రీకాకుళపు జగదీశ్వరరావు, దేవరాపల్లికి చెందిన కొత్తూరు త్రిమూర్తులు, ఎలమంచిలికి చెందిన మునగపాక గోవింద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధికారి కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

శాలివాహన కమ్యూనిటీ వెల్ఫేర్ సభ్యునిగా జగదీశ్వరరావు

చోడవరం : జిల్లా శాలివాహన కమ్యూనిటీ వెల్ఫేర్ సభ్యునిగా మండలంలో నరసయ్యపేట గ్రామానికి చెందిన శ్రీకాకుళపు జగదీశ్వరరావు నియామకమయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి జగదీశ్వరరావుకు సోమవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వర తనకు పదవి రావడానికి సహకరించిన ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీకు కృతజ్ఞతలు తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమంలో టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆయన కనకదుర్గమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.10వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈశ్వరరావు, కొప్పాక కాసుబాబు, కొమార బాబురావు, కడిమి నాగేశ్వరరావు, గంజి ఈశ్వరరావు, తాతబాబు, కసిరెడ్డి అప్పలనాయుడు, లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర కో-ఆపరేటివ్ డిఆర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సహకార సంఘం వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో సోమవారం ఆయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం నడుస్తున్న సహకార సంఘాలన్నింటినీ బలోపేతం చేయడంతో పాటుగా కంప్యూటీకరణ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కొనపల్లి రామ్మోహన్‌రావు, సీఈఓ ఆడారి వేణుగోపాలకృష్ణ, పెంటకోట మహేష్, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పలు గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'


మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి - చోడవరం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మండలంలో గజపతినగరం గ్రామంలో స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తమ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగరాజు, స్థానిక సర్పంచ్ మళ్ల శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కొంతమంది స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వగ్రామం తారువలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, మండల స్థాయి అధికారులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. మండలంలోని డిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, గున్నెంపూడి, సీతయ్యపేట, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట శివాలయం, వడ్డాది భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, గౌరీ పరమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం ఉదయం నాలుగు గంటల నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు శివాలయాల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

దేవరాపల్లి : మండలంలోని తిమిరాం ఉమామహేశ్వర నీలకంఠేశ్వరుడి శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని శివాలయాల్లో కార్తీకమాసం పూజలు ఘనంగా జరిగాయి.

పరవాడ : పరవాడలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, బొద్దపు చిన్నారావు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీడికాడ : కార్తీక మాసం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలో శివాలయానికి భక్తులు తరలి వచ్చారు. శివునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా శివాలయం లో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు

పలు చోట్ల అన్న సమారాధనలు


భోజనాలు వడ్డిస్తున్న బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కార్తీక మాసం సందర్భంగా సోమవారం పలు చోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. అచ్యుతాపురం మండలం దుప్పుతూరు శివాలయంలో బ్రాండిక్స్ ఇండియా పార్ట్నర్ దొరస్వామి సోమవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత అవసరమని, అది దేవాలయాలలో దొరుకుతుందని చెప్పారు. ఈ సందర్భంగా దొరస్వామిని గ్రామ సర్పంచ్ దేశంశెట్టి శంకర్రావు, ఉప సర్పంచ్ దేశంశెట్టి ఈశ్వరరావు తదితరులు సత్కరించారు. గ్రామ మాజీ సర్పంచ్ దేశంశెట్టి పైడియ్య నాయుడు, శెట్టి నాగేశ్వరరావు, ప్రగడ ప్రకాష్, ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కె కోటపాడు : మండలంలోని చౌడువాడ గవరపేటలో ఉన్న సంతోష్ మాత ఆలయం వద్ద సోమవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శరగడం అప్పారావు, మళ్ల వెంకటరమణ, శరగడం అచ్చమనాయుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ప్రారంభించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని ఉపమాక శివాలయం వద్ద సోమవారం భారీ అనసమారధన నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుండి ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకటలాడింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు పలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు,శేషాచార్యులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, వైసిపి నాయకులు కొప్పిశెట్టి హరి, కొల్లాటి బుజ్జి, సిద్దాబత్తుల కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల కేటాయింపులో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ ఆరోపించారు. మండలంలో కొండకర్ల, చోడపల్లిలోని జగనన్న కాలనీల స్థలాలను సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటే మంజూరు చేసిన స్థలాలను రద్దు చేస్తామని భయపెట్టి వారితో ఇంటి నిర్మాణాలు చేయిస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టినప్పటికీ వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. దొప్పర్లలో అధికారులే బినామీ పేర్లతో ఇంటి స్థలాలు రాయించుకుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. ఆయన వెంట జనసేన నాయకులు మోటూరు శ్రీవేణి, ఒడిసెల నాయుడు ఉన్నారు.

అనకాపల్లి : జగనన్న కాలనీలపై జనసేన సోషల్ ఆడిట్‌లో భాగంగా స్థానిక గాంధీ నగరం సచివాలయంలో అర్హుల ఎంపిక, నిధులు విడుదలపై జనసేన అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావు సోమవారం ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీలో కేవలం రూ.10 వేలు నుంచి రూ.15 వేలు లబ్ధిదారుల చేతిలో పెట్టి సామాగ్రి సరఫరా పేరిట మిగిలిన మొత్తాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. జనసేన నాయకులు పావాడ కామరాజు, గంజి సత్య రావు, కోట్ని శ్రీరాములదొర పాల్గొన్నారు.

గొలుగొండ : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర విమర్శించారు. జగనన్న ఇళ్లు...పేదల కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం జోగుంపేటలోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, నీరు, కరెంట్ సదుపాయాలు ఎక్కడా కానరాలేదన్నారు. లబ్ధిదారులు అప్పులతో బేస్‌మెంట్ వేసుకున్నారని, ఇంటి నిర్మాణానికి సరైన సహకారం ప్రభుత్వం నుండి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు గండెం దొరబాబు, రేగుబళ్ల శివ, వాసం వెంకటేష్, బోయిన చిరంజీవి, లంక సత్యనారాయణ, ఎలిశెట్టి శ్రీను, జి.వెంకటరమణ, వాసం నాగసత్యనారాయణ, పాము సింహాచలం, రేగుశెట్టి శ్రీను, ఎన్.నాయుడు, లింగంపేట ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రేమ సమాజం పిల్లలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- చోడవరం : బాలల దినోత్సవ సందర్భంగా ఆర్ఎంపి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రేమ సమాజంలో పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం వారికి మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ సమాజంలో ఉన్న పిల్లలకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించి వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, లోక్‌సత్తా అధ్యక్షులు బి.బాబ్జీ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ప్రేమ సమాజం రాజు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి కేశవాచార్యులకు సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కోర్టులో పదవ అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహించిన కేశవాచార్యులను సోమవారం అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇంత వరకు జిల్లా ఇన్‌ఛార్జి జడ్జిగా వ్యవహరించిన ఆయన బదిలీపై వెళ్లిన నేపథ్యంలో ఈ సత్కారం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.రాజశేఖర్, దివాకర్, సీనియర్ న్యాయవాదులు రమణయ్య, జగన్నాథరాజు, మైఖేల్, రోజా, సాయిరాం పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు క్షీరాభిషేకం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద గల గౌరీ పరమేశ్వరుల ఆలయంలో సోమవారం మాజీ చైర్మన్ మళ్ల సాంబశివరావు గౌరీ పరమేశ్వరులు, సుందరేశ్వర స్వామి, మీనాక్షి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కొణతాల కారుబాబు, సేవా సాధన అధ్యక్షులు కాంగ్రెస్ నూక రామలింగస్వామి సాంబశివరావును సత్కరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎల్లపు చంద్రమోహన్, కాంగ్రెస్ సూరి అప్పారావు, వెంకట సత్యనారాయణ, ఆళ్ల సంతోష్ దంపతులు పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని విస్సన్నపేట గ్రామంలో ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీస్) నివారణకు ఉచిత టీకా కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కశింకోట పశు వైద్య అధికారి డాక్టర్ అల్ఫ్రెన్స్ జార్జ్ మాట్లాడుతూ మండలం మొత్తం ఆవులకు లంపీ స్కిన్ టీకాలు 7100 డోసులు కేటాయించగా 3000 డోసులు ఇప్పటికే ఆవులకు వేసినట్టు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లోనూ టీకాలు ఉచితంగా వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.అనురాధ, ఏహెచ్ఏ ఈశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కానరాని గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-మాడుగుల:అట్టహాసంగా ప్రారంభం కావలసిన గ్రంథాలయ వారోత్సవాలు మొట్టమొదటి రోజున బోసిపోయాయి. ఈనెల 14 నుండి 20 తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. ప్రతి ఏటా మొదటి రోజు ఈ ఉత్సవాలు అట్టహాసంగా జరిగేవి. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ప్రారంభోత్సవాలు నిలిచిపోయాయి. ప్రతి ఏడాది మాదిరిగా కాకుండా జిల్లా కేంద్రంలో అధికార పార్టీకి చెందిన బడా నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవం ఏర్పాటు చేయడమే. బడా నేతలను ప్రసన్న చేసుకునేందుకు జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు విమర్శలు వినబడుతున్నాయి. గ్రంథాలయాలకు చెందిన నేతలు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలుస్తుంది. వైసీపీ పార్టీకి చెందిన బడా నేతను ప్రసన్న చేసుకునేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని, గ్రామీణ ప్రాంతాలు, ఇతర ప్రాంతాలలో ప్రారంభించవలసిన గ్రంథాలయ వారోత్సవాలు మాత్రం ప్రారంభం కాలేదు. మొదటి రోజున గ్రంథాలయాలలో బాలల దినోత్సవ వేడుకలతో పాటు పతాకావిష్కరణ, ప్రారంభ వేడుకలు జరగాల్సి ఉంది. గ్రంథాలయాల పట్ల పలువురికి ఆసక్తి కలిగించేందుకు గ్రంథాలయ ఉద్యమం స్ఫూర్తి కలిగించేందుకు అనేక సంవత్సరాలుగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం విడ్డూరంగా మారింది. మొదటిరోజు కార్యక్రమం లేకపోగా తర్వాత కార్యక్రమాలు అయినా స్థానిక గ్రంథాలయాలలో నిర్వహిస్తారా లేదా జిల్లా కేంద్రంలో చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రారంభం కాని వారోత్సవాలు

నర్సీపట్నంటౌన్: ప్రతి ఏటా నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలు నర్సీపట్నంలో కాన రాలేదు. ప్రారంభానికి నోచుకోలేదు. ప్రతి ఏటా 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఈ నెల 12న మీడియాకు తెలిపారు. అయినప్పటికీ శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు కాన రాలేదు.యువత సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఆధునిక యుగంలో విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే వారోత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. వివిధ రకాల పోటీలు ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తారు.స్థానిక గ్రంథాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో నిరాశతో పాఠకులు వెనుతిరిగారు. దీనిపై లైబ్రేరియన్ రాజును వివరణ కోరగా.. జిల్లా కేంద్రంలో వారోత్సవాలు జరుపుతామని ఉన్నతాధికారులు తెలియజేయడంతో అక్కడికి వెళ్ళామని, రేపటి నుంచి వారోత్సవాలు కొనసాగిస్తామని తెలిపారు.



నర్సీపట్నంలో ఖాళీగా ఉన్న గ్రంథాలయం

విద్యుత్ స్తంభం నుంచి మంటలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని పాములవాక గ్రామంలో ఎస్ఎస్ఎస్ ప్రైవేటు కళాశాల వద్ద ఉన్న విద్యుత్ లైన్ నుంచి మంటలు రావడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. కళాశాల ఆవరణలో 11 కెవి విద్యుత్ లైను ఉంది. అకస్మాత్తుగా స్తంభం నుంచి మంటలు, పేలుళ్ళు సంభవించాయి. దీంతో, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయానికి అక్కడ సమీపంలో విద్యార్థులు ఎవరు లేక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత విద్యుత్తు లైను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని కళాశాల ప్రిన్సిపాల్ సాయికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.




విద్యుత్ స్తంభం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజనీర్

తాగునీటి ట్యాంక్‌కు స్థలం పరిశీలన

ప్రజాశక్తి-రావికమతం:ఇంటింటికి మంచి నీటి కుళాయి పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుజాత తెలిపారు. జలజీవన్ పథకం ద్వారా రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను నిర్మించేందుకుగాను సోమవారం ఎఇ సుజాత, జల జీవన్ సైట్ ఇంజనీరు సంతోష్‌లు కవగుంటలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ, కవగుంట గ్రామపంచాయతీకి జల జీవన పథకం ద్వారా 20,000 వేల లీటర్ల రక్షిత మంచినీటి ట్యాంకును నిర్మించేందుకుగాను ప్రభుత్వం రూ.41 లక్షల నిధులు మంజూరు చేసిందని ఆమె తెలిపారు. త్వరలో పనులు కూడా ప్రారంభించడం జరుగుతోంద న్నారు. దీని ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కొళాయిని అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు మాట్లాడుతూ, చోడవరం నియోజకవర్గానికి జల జీవన పథకం ద్వారా ఎక్కువ రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులను ప్రభుత్వ విప్ చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ సూపర్వైజర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తా..

ప్రజాశక్తి-గొలుగొండ:మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ ఛైర్మన్(ఎఎసి)గా కొల్లు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, తనపై నమ్మకముంచి ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌కు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల బాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, పిఏసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమిర సర్పంచ్ అల్లు రాజుబాబు, ఏటిగైరంపేట మాజీ సర్పంచ్ పాము అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ పాము రాజుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు సుర్ల రమణ, గుండుపాల సర్పంచ్ రామకృష్ణ, అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికె సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆర్‌బికే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ కమల్ సూచించారు. నక్కపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఆర్‌బికే సిబ్బందికి మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ కమల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందికి క్షేత్రస్థాయిలో వివిధ వ్యవసాయ, ఉద్యానవన శాఖలో మేలైన యాజమాన్య పద్ధతులు, పొలంబడి, తోటబడి పై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం, ధృవీకరణ పై వ్యవసాయ అధికారి చిరంజీవి అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు టి.దాసు వరిలో సుడిదోమ తెగుళ్ల సేంద్రియ పద్ధతిలో తగ్గించవచ్చునని తెలిపారు. తూటికాడ ఆకులు 10 కేజీలు, 10 లీటర్లు ఆవు మూత్రం కలిపి వేడి చేసిన మిశ్రమాన్ని ఫిల్టర్ చేసి ఒక ట్యాంకు ఒక లీటర్ చొప్పున పిచికారి చేయడంతో పూర్తిగా తగ్గించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, ఉద్యానవన అధికారి ఉమామహేశ్వరి, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు చిరంజీవి, అరుణకుమారి, అధినారాయణ, ఏఈఓలు, వివిధ మండలాల ఆర్‌బికే సిబ్బంది, ఎంపిఏఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్ కమల్

ఆలయాల అభివృద్ధికి రూ.40 వేల విరాళం

ప్రజాశక్తి -మాడుగుల ఆలయాల అభివృద్ధికి టిడిపి నేత పైలా ప్రసాదరావు రూ.40 వేల విరాళం అందించారు. మాడుగుల మండలం వాతనపూడి అగ్రహారం, పెంటయ్యపాలెం గ్రామాలలో గల పైడితల్లమ్మ, శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి రూ.40,000 విరాళం అందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విరాళం అందించిన ప్రసాదరావుకు పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సాంబమూర్తి, మైచర్ల నానాజీ, కోరుకొండ రామనాయుడు, వేపాడ రాము, బోడ అప్పారావు, దండెల్ల శంకరరావు, పడాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న పైలా ప్రసాదరావు



సామగ్రి ఇస్తున్న నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాలకు వితరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్వాడీ బాలబాలికలకు జనసైనికులు ప్లేట్లు, టేబుల్ వితరణగా అందజేశారు. సోమవారం ఉదయం మేజర్ పంచాయతీ తిమ్మాపురం గ్రామ శివారు గోకులపాడు అంగన్వాడీ కేంద్రానికి తిమ్మాపురం జనసేన నేత శానాపతి బాబూరావు మాష్టారు, గోకులపాడు జన సైనికుడు మత్తికార్తీక్ ల ఆర్థిక సహాయంతో నలభై మంది విద్యార్థులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు, పదివేలు విలువ చేసే టేబుల్‌ను సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో నక్క శ్రీనివాసు, పిల్లి నాగేష్, ఏవీఎస్, బల్లంకి రాజు గణేష్, శ్రీను నాగరాజు వీరబాబు లోవరాజు రఘు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళలు

సామూహిక కుంకుమ పూజలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రేబాక గ్రామంలో గూడుపుమ్మతల్లి ఆలయ సన్నిధిలో కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సర్పంచ్ సాధిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ వెల్లంకి ధనలక్ష్మి, కాసుబాబు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్యవిద్యానంద భారతీ స్వామి ఆధ్యాత్మిక బోధన చేశారు.భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణాచార్యులు, శ్రీపాద సత్యదేవశర్మ, గురుభవాని రాంబాబు పాల్గొన్నారు .

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా గార్ని షరీఫ్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా గడిచిన రెండు రోజులుగా ముస్లిం సోదరులు ప్రత్యేక పూజలు చేశారు. ముస్లిం సోదరులు అంతా కలిసి ఊరేగింపు నిర్వహించారు.



ఊరేగిస్తున్న ముస్లిం సోదరులు



నగదు అందిస్తున్న డ్రైవర్

ఆర్‌టిసి డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం గ్రామానికి వాసచుక్కల అనంత మురళి సంధ్యాల నుండి విజయవాడ ఆర్టీసీ బస్సులో వస్తున్నాడు. తాను నిద్రిస్తున్న సమయంలో పర్సు జేబులో నుంచి జారీ బస్సులో పడిపోయింది. విజయవాడలో దిగి విశాఖపట్నం వెళ్లే బస్సు ఎక్కిన తర్వాత తన పర్సు లేదని గుర్తించాడు. దీంతో దొడ్డి రాజు సహాయంతో అవనిగడ్డ ఆర్టీసీ ఎంక్వైరీ సిబ్బందిని సంప్రదించగా వారు తక్షణమే స్పందించి స్టాఫ్ నెంబరు, బస్సు నెంబరుతో పాటు డ్రైవర్ రహమతుల్లాను సంప్రదించారు. బస్సు వెతకగా సీటు కింద పర్సు దొరకడంతో పర్సును మురళీకి అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్ రహమతుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 641వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఉక్కును కాపాడు కోవడం కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని స్టీల్‌ప్లాంట్ విషయమై నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. దీక్షల్లో ఎల్‌ఎంఎం, ఎస్‌బిఎం విభాగాలకు చెందిన ఎం.త్రినాథ్, కె.రవికుమార్, డి.సత్యనారాయణరావు, ఎన్‌ఎల్.నాయుడు, కె.భాస్కర్ పాల్గొన్నారు.

పోలీసు, కోర్టు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎపి పోలీసు, ఎస్ఐ, జిల్లా కోర్టు, హైకోర్టు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 18 నుంచి డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమవుతాయని స్టడీ సర్కిల్ నిర్వాహకులు డాక్టర్ బి.గంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా యువతకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగాలకు అవసరమైన శరీర దారుఢ్య పరీక్షకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 16లోగా http://bit.ly/3GINgEW లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9315014015 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

సమస్యలపై ఓలా, ఊబర్ డ్రైవర్ల వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ : ఓలా, ఊబర్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.జగన్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు మీడియాతో మాట్లాడారు. ఊబర్, ఓలా యాప్‌లతో విశాఖపట్నంలో సుమారుగా 4 వేల మంది లింకై ఉన్నారన్నారు. వీటిలో పనిచేస్తున్న డ్రైవర్లను యాజమాన్యాలు 10 సంవత్సరాల నుంచి ఇబ్బందులు పెడుతున్నాయని తెలిపారు. గతంలో డిటిసి దగ్గర అంగీకరించిన అంశాలను కూడా అమలు చేయకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ఏదైనా ఇబ్బంది వస్తే ఎవరితో మాట్లాడాలో కూడా చెప్పలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న డ్రైవర్లు కూడా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ అధ్యక్షులు సి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.పోలినాయుడు, ఎస్.అబ్బాయి, సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ ఉన్నారు.

జోగుంపేటలో వన భోజనాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగంపేట గ్రామంలో కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా జోగంపేట కమ్యూనిటీ భవనం వద్ద వన భోజనాలు కార్యక్రమం చేపట్టారు. గ్రామ వైసిపి నాయకులు చిటికెల వరహాలబాబు, జోగంపేట సర్పంచ్ జువ్వల లక్ష్మి, భర్త జువ్వల దేముడు, వైస్ సర్పంచ్ లాలం స్వామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

సందడిగా బాలల దినోత్సవం



కోటవురట్లలో బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కోన అన్నపూర్ణ దేవి ఆర్థిక సహాయంతో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతి ప్రధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, వైస్ సర్పంచ్ గంజి రాజేష్, పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేష్, నీటి సంఘం అధ్యక్షులు కలిమి గోసమ్మ, పాల సంఘం అధ్యక్షులు గొల్లవిల్లి సత్యారావు, వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, ఎలిమెంటరీ స్కూల్ కమిటీ చైర్మన్ జమ్మల భీమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలు అందంగా ముస్తాబై పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల కేంద్రంలో బాలికల పాఠశాల, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో ప్రత్యేకంగా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

గొలుగొండ: మండలంలోని సిహెచ్.నాగాపురం. ఎంపీపీ స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఘురాం, స్కూల్ హెచ్‌ఎం చిన్నారావు మాస్టర్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు. చోద్యం, కొత్త మల్లంపేట, ఏఎల్ పురం తదితర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

నర్సీపట్నం టౌన్: పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సంగిన రమణ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు మీసాల సుబ్బన్న నెహ్రు ఈ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత భారతదేశ తొలి ప్రధానిగా నెహ్రూ బాధ్యయతలు స్వీకరించారన్నారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశాన్ని అభివృద్ధి పదంలో నడిపించారన్నారు. బాలబాలికల పట్ల అమిత ప్రేమ చూపేవారని, దీంతో బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దా, కర్రి తాతబ్బాయి, జనపరెడ్డి సూరిబాబు, చుక్కల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనోస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

పాయకరావుపేట: పట్టణంలోని కనోస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ సోఫియా మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో మంచిగా స్థిరపడాలని, ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యాన్ని సంపాదించాలన్నారు. మానసిక ఒత్తిడిని గురికాకుండా విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మేరీ, సిస్టర్ అలెక్స, పిటి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

భారత దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు, బాలల దినోత్సవ కార్యక్రమాలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.



గొలుగొండలో..

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో మదర్ థెరిసా వెల్ఫేర్ ఫౌండేషన్ సీఈవో కర్రి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎంపీ డాక్టర్ సత్యవతి విష్ణుమూర్తి పాల్గొని, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ జాజుల ప్రసన్న రమేష్ పాల్గొన్నారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో నెహ్రూ విగ్రహానికి ఆస్క్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రాజేంద్రప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హరిబాబు, సామ్రాజ్యం, సౌజన్య మోహిని పాల్గొన్నారు. జీవీఎంసీ వుడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, అనకాపల్లి డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ స్వాతి, సత్యనారాయణపురం మండల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గండేపల్లి తులసి లక్ష్మి, లక్ష్మీదేవి పేట లక్ష్మీ గ్రంథాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు కొణతాల సన్యాసిరావు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో నెహ్రూ చిత్ర పటానికి కశింకోట ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబొల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవంలో ఎంఇఒ ఎస్.అప్పలరాజు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సిహెచ్.చిన్నమ్మాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాసరచన, ఉపన్యాస, కోలాటం, డ్రాయింగ్ పోటీలలో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నెహ్రూ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించిన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అచ్యుతాపురం : బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక భవాని విద్యానికేతన్ పాఠశాలలో బాలికలు చేసిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ కె.సంతోష్, డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు. తిమ్మరాజుపేట పాఠశాలలో ఉపాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు.

యలమంచిలి : చిల్డ్రన్స్ డే సందర్భగా బాలల హక్కులను పరిరక్షించాలని కోరుతూ బాలల బాధ్యత - అందరి బాధ్యత అన్న నినాదంతో చైల్డ్ లైన్ సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి కనకమహాలక్ష్మి ఆధ్వర్యాన పట్టణంలో సోమవారం 300 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలికల హైస్కూలు నుండి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు గుండా కొత్తపేట వరకూ కొనసాగింది. బాల్య వివాహాలు ఆపుదామంటూ నినదించారు. ఈ ర్యాలీకి మహిళా పోలీసులు మద్దతు ప్రకటించారు. స్థానిక మహిళా పోలీస్ కుమారి మాట్లాడుతూ ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైనా విద్యార్థులు చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు లీల, లత, భవాని, సునీత, వీరలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో ఘనంగా వేడుకలు

చోడవరం : స్థానిక శ్రీవిజ్ఞాన్ స్కూల్లో సోమవారం బాలల దినోత్సవాన్ని డైరెక్టర్ ఎంఎంకె.రాజు, ప్రిన్సిపాల్ ఎం.జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.



నృత్యం చేస్తున్న శ్రీ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు

దళితుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామ దళితులు నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం ముందు సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో దళితులు మాట్లాడుతూ, మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన గుడాల వీరస్వామి తన ఐదుగురి కుమారుల ఉమ్మడి భూమి(సీలింగ్ భూమి) పట్టా నెంబరు 1316 సర్వే నెంబరు 710/1లో 1.95 సెంట్లలో జగనన్న కాలనీకి 0.65 సెంట్లు తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఇచ్చిన నష్టపరిహారం రూ. 11,61,875లు ఐదుగురు కొడుకులకు సమానంగా రూ.2,32,375 చొప్పున వేయకుండా ఇద్దరి పేరున కొంత డబ్బులు వేశారన్నారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ భర్త కలిసి అవినీతికి పాల్పడ్డారని తెలిపారు.

బిఎస్పీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ బొట్టా నాగరాజు మాట్లాడుతూ, ఐదుగురు కుమారులకు సరిసమానంగా నష్టపరిహారం పంపిణీ చేయకుండా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడ్డారో ఆ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుడాల వీరస్వామి ఐదుగురు కుమారులకు చెందిన 1.95 సెంట్లలో 0.65 జగనన్న కాలనీ పోగా మిగిలిన భూమి 1,30 సెంట్లు ఐదుగురు కుమారులకు, వారి వారసులకు 0.26 సెంట్లు చొప్పున మ్యూటేషన్ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలన్నారు. గుడాల వీరాస్వామి పట్టా నెంబరు 1316లో గల 1.95 సెట్ల 0.65 సెంట్లు జగనన్న కాలనీకి పోగా మిగతా 1.30 సెట్లు భూమిని సర్పంచ్ రుత్తల జ్యోతి, ఆమె భర్త రుత్తల శ్రీనులు అక్రమంగా, దౌర్జన్యంగా ప్లాట్ల రూపంలో సెంటు లక్షల్లో అమ్మేస్తున్నారని, వీరిపై ఎస్సీ, ఎస్టీ, పిఒఎ చట్టం కింద చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షకు సిపిఎం నాయకులు డి.సత్తిబాబు మద్దతు తెలిపారు.



దీక్ష చేపట్టిన దళితులు

సిఎం కప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- అభినందించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గొలుగొండ: నియోజకవర్గ స్థాయిలో నర్సీపట్నంలో జరిగిన సీఎం కప్ కబడ్డీ జట్టు ఎంపికలో గొలుగొండ మండలం నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక పీఈటి టివి.రమణ తెలిపారు. ప్రతీ ఏటా నిర్వహించే సీఎం కప్‌లో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గం ఎంపికలో 13 మంది ఎంపిక కాగా ఏఎల్‌పురం గ్రామానికి చెందిన గొర్లి శివ, పైల సాయి, శివ, గొంప స్వామి, పైల వరకృష్ణలు ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు